తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# సర్వేజనాః సుఖినో భవన్తు!

పోలాప్రగడ
జనార్దన రావు

"నానోట్స్ యిస్తా కాని నా చీరకి కొంచెం ఫాల్ కుట్టిపెట్టాలి" పెద్ద కూతురి మాటలు లీలగా చెవిలో పడ్డాయి గోపాలం గార్కి. "గురూ! నీ స్కూటర్ యివ్వు. నేను సరాసరి గ్రౌండ్‌కి వచ్చేస్తా. ఈ వేళ నీకు చెలింగ్ ఖాయంగా యిస్తా" కెప్టెన్ హోదాలో స్కూటర్‌కి చెలింగ్‌కి ముడిపెట్టిన గోపాలం గారి పుత్ర రత్నం మాటలు స్కూటర్ చప్పుడులో కలిసిపోయాయి. "ఇదిగో ఈ గుప్పెడు మరమరాలు తీసుకొని నీ బబుల్ గమ్ యివ్వు" యు.కె.జి. చదువుతున్న ఆఖరి కొడుకు బాబ్జీ వ్యాపార శైలి ఆశ్చర్య పరిచింది గోపాలం గార్కి. స్వార్థంతో కూడిన పిల్లల మాటలు కంట్లోనలుసులా కన్నీళ్ళు తెప్పించి ఒక్కసారి గతాన్ని తలుచు కునేలా చేశాయి ఆయన్ని.

గోపాలానికి చిన్నప్పుడే తండ్రిపోయాడు. అతన్ని తల్లే పెంచి ప్రయోజకుడ్ని చేసింది. ఆవిడికి ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో మంచి పేరుంది. శుభం వచ్చినా, అశుభం వచ్చినా ముందుండేది. పచ్చకామెర్ల దగ్గరనుంచి పసిపిల్లకి కడుపునెప్పి వరకు, వంశపారం పర్యంగా తెలిసిన



వైద్యం ఉచితంగా చేసేది. ఎవరింట్లోనైనా గేదె ఈనడానికి యిబ్బంది పడుతున్నా, పురిటికి అవస్థ పడుతున్నా తెల్లవార్లూ అక్కడే వుండి సాయం చేసేది. అప్పడాలు పెట్టడం దగ్గరనుంచి ఆవకాయ పెట్టడం వరకు చేతి సాయంగా వుండేది. ఎవరైనా తమ తృప్తికోసం ఏదన్నా యివ్వబోతే వాళ్ళ మనస్సు నొప్పించ కుండా సున్నితంగా "నా ఒంట్లో సత్తువవుంది మీకు సాయం చేస్తున్నా. ఈ నాడు నేనూ నా కొడుకు యిల్లా వున్నామంటే ఓ నాడు మా పెద్దలు చేసిన పుణ్యం. మరి నా తర్వాత వాళ్ళు కూడా సుఖంగా వుండాలంటే మరి నేనూ నా పెద్దల్లా నాకు చేతనైన సాయం చేయాలిగా" అంటూ వుండేది.

ప్రతిఫలాపేక్ష లేకుండా ఇతరులకి సాయం చేయడంలో గోపాలం కూడా తల్లి అడుగు జాడల్లో నడిచాడు. స్కూలుకి కొత్తగా ఎవరైనా మాస్టారు వస్తే చాలు, ఆయనకి అద్దె యిల్లు చూపించడం, పాలవాడిక, పనిమనిషిని కుదర్చడం వగైరాలు నెత్తిని వేసుకునేవాడు. చుట్టు పక్కల వాళ్ళకి సొంత సైకిలు మీద ఝూం అంటూ బజారుకి వెళ్ళి సరుకులు తెచ్చేవాడు. కార్తీకమాసంలో గోదావరికి స్నానాలకెళ్ళే వాళ్ళకి సాయంగా తెల్లవారుఝామున చలిలో లాంతరు పట్టుకొని దుప్పటి ముసిగెట్టుకొని వెళ్ళి వాళ్ళ పుణ్యంలోకొంత దుప్పట్లో తనకు తెలియకుండా మూటకట్టుకొని వచ్చేవాడు. తల్లిపోయిన సంఘటన గోపాలానికి గుర్తొచ్చింది. ఎంత జనం- ఇసికేస్తే రాలనంత జనం. పోయిన వాళ్ళు గొప్ప వాళ్ళో కాదో చావునుబట్టి తెలుస్తుందేమో... కన్నీళ్ళు రాసాగాయి గోపాలానికి.

"నట్టింట్లో కన్నీళ్ళేమిటి ? ఏదన్నా కాస్త ఉపయోగముంటే పెట్టుకోవాలి కాని" అన్న భార్య మాటతో ఈ లోకంలో కొచ్చి పడ్డారు గోపాలం గారు.

"కన్నీళ్ళని కూడా లాభానికి వాడుకునే నీకు... నువ్వు స్వార్థపరులుగా తీర్చిదిద్దే నీ పిల్లలకీ జోహార్లు"

"మీ అడుగు జాడల్లో నడుచుకుంటే ప్రతి వాళ్ళూ వాళ్ళని వాడుకునే వాళ్ళు... మీ ఉపకార బుద్ధితో మన కాలనీలో నానామాటలు వినవల్సి వస్తోంది. మన ఎదిరింటి సర్దార్జీకి మీరు ఇల్లు కట్టడంలో సాయం చేస్తున్నారు... ఏం లేకపోతే ఎందుకుచేస్తారు, కనీసం నూటికిపదియూపాయలు లాభం వుంటుందంటున్నారు అందరూ. తెలుసా?"

"అతను రెండు రోజులు వూళ్ళో వుంటే-మరో రెండు రోజులు ఎక్కడ వుంటాడో అతనికే తెలియదు. లారీ డ్రైవర్ ఉద్యోగమే అల్లాటిది. పైగా అతను చదువుకున్నవాడుకాదు. ప్లాన్ ఎప్రూవల్, లోన్ తీసుకునే విధానం ఏం తెలుస్తాయి చెప్పు. అయినా ఎవరెల్లా అనుకుంటే నాకేం! నేను ఎంత తింటున్నానో అతను ఎంత యిస్తున్నాడోమాయిద్దరికితెలుసుపైనున్న భగవంతుడికి తెలుసు."

"నా బాధ అందరూ అన్నందుకు కాదండి, మీరు తిన్నందుకు."

"అన్నం పెట్ట లేకపోయినా... అన్నం పెట్టే యిల్లు చూపించాలన్నారు మన పెద్దలు. మా అమ్మ కూడా అదే నేర్పింది. నా జీవితం యిల్లా పోనీయ్" అన్నారు గోపాలంగారు బాధగా.

ఇంతలో ఎదురింటి సర్దార్జీ, అతని భార్యా గృహ ప్రవేశ పిలుపుకి వచ్చారు. "భాయిసాబ్, మీ మదత్ లేకపోతే యిల్లు కట్టడం నా వల్ల అయ్యే పనికాదు. మీరు, భాభీ రేపు మా ఇంటికి భోజనానికి రావాలి" అంటూ గోపాలంగారి చెయ్యిపట్టుకొని అభిమానంతోపిలిచాడు సర్దార్జీ.

"తప్పకుండా వస్తాం భాయిసాబ్. అన్నట్టు మీకు సుగర్‌కి ప్రాబ్లెమ్ అవుతుందేమో! అప్లికేషన్ రాసిస్తా, దానిమీద సంతకం చేసి నాకియ్యి, పర్మిషన్ తెప్పిస్తా" అన్న గోపాలం గారి మంచితనానికి మరోసారి ఆనందపడి వెళ్ళారు సర్దార్జీ దంపతులు.

"మీకు బొత్తిగా బ్రతుకు తెరువు తెలియదు. పర్మిషన్ తెప్పిస్తే అంతో యింతో పుచ్చుకుంటార్టగా" అన్న భార్య మాటలకి చిరాకు పడి "చూడు లక్ష్మీ! మనం ఉపకారం చేస్తున్నామంటే మనకి ప్రత్యుపకారం జరగాలని కాదు, కనీసం ఎవరివల్లా అపకారం జరగదు అనే మనోధైర్యం ముందుకు నడిపిస్తుంది. ఇంత కంటే యింకేం కావాలి! నేను నమ్మిన సిద్ధాంతాలతో ఈ జీవుడ్ని బ్రతకనీయ్" అంటూ ఆఫీసుకి వెళ్ళిపోయారు గోపాలం గారు.

సాయంత్రం ఆఫీసు నుంచి యింటి కొచ్చేసరికి ఇంట్లో వాళ్ళల్లో ఏదో దైన్యత కనబడింది గోపాలం గార్కి. ఏంజరిగిందిఅనిఅడక్కుండానే మంచం మీద వున్న బాబ్జీ చేతికి, నుదుటికి వున్న కట్లు సమాధానం చెప్పాయి. భార్య కళ్ళల్లోకి చూసారు ఎలా జరిగింది అన్నట్టు. "డాడీ సాయంత్రం స్కూల్నించి వస్తోంటే, అసలు లారీ క్రింద పడి వచ్చిపోయే వాడ్నే కాని మన ఎదురింటి సర్దార్జీ అంకుల్ టకీమని పక్కకి లాగాడు. దాంతో కొంచెం దెబ్బలు తగిలాయి అంతే" అన్న కొడుకు మాటలకి హమ్మయ్య అని నిట్టూర్చారు గోపాలంగారు. అప్పుడు చెప్పింది ఆ యిల్లాలు అసలు సంగతి. "ఈ వేళ ఉదయం గృహ ప్రవేశానికి సామాన్లు, పుల్లలు అవి తీసుకు రావడానికి లారీలో వెళ్ళాడట సర్దార్జీ. వస్తూ యాక్సిడెంట్‌లో పోయాట్ట"-ఉదయం చని పోయిన సర్దార్జీ సాయంత్రం తమ యింట్లో ఒక ప్రాణాన్ని కాపాడ్డం... అప్పుడు తెల్సొచ్చింది ఆ ఇంటిల్లిపాదికి-పరోపకారానికి ఎన్ని రూపాలో అని.

